తెలంగాణ **TELANGANA MUCHATLU**

# ముచ్చట్లు

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం-8 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 251 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## తెలంగాణ–ఆంధ్రప్రదేశ్‌కు
# గౌరవం తెచ్చిన కేడెట్లు

- రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న ఎన్సీసీ కేడెట్లకు గవర్నర్ అభినందనలు
- ఆర్‌డీసీ కంటింజెంట్–2026కు ఘన సత్కారం
- శాసనం, అంకితభావం ప్రశంసించిన గవర్నర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** న్యూఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్-2026లో దేశాన్ని ప్రతినిధ్యం వహించిన ఎన్సీసీ డైరెక్టరేట్, తెలంగాణ & ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్‌డీసీ కంటింజెంట్-2026 కేడెట్లను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లోక్ భవన్, హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు.

మిగతా 2లో



## జవహర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ముషీరాబాద్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం
- బస్తీవాసుల సమస్యలపై నేరుగా చర్చ
- ప్రజా సదుపాయాల విస్తరణకు కట్టుబాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** ముషీరాబాద్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో స్థానిక ప్రజలకు సామాజిక,

7లో

## కాంగ్రెస్ పాలనలోనే పట్టణాల సమగ్ర
# అభివృద్ధి సాధ్యం
### మంత్రి శ్రీధర్ బాబు


- తాండూరు, వికారాబాద్, చేవెళ్లలో ఎన్నికల ప్రచార సభలు
- పట్టణ మౌలిక సదుపాయాల పునరుజ్జీవనం
- యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**తాండూరు / వికారాబాద్ / చేవెళ్ల, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో అర్థవంతమైన పట్టణాభివృద్ధి కాంగ్రెస్ నాయకత్వంలోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తాండూరు, వికారాబాద్, చేవెళ్ల పట్టణాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలను ఇప్పుడు ప్రణాళికాబద్ధమైన పౌర మౌలిక సదుపాయాలు, మెరుగైన సేవలు, బాధ్యతాయుత ఆర్థిక నిర్వహణతో తిరిగి పుంజుకుంటున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

మిగతా 2లో






## గోదావరి జలాలతో తాండూరు-పరిగి-వికారాబాద్‌కు
# సాగునీరు
### సీఎం రేవంత్ రెడ్డి

- మూడేళ్లలో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పూర్తి
- తాండూరులో డ్రైనేజీ, తాగునీటి పనులు పూర్తి చేస్తాం
- వికారాబాద్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**వికారాబాద్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

గోదావరి జలాల ద్వారా తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే వచ్చే మూడేళ్లలో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి లక్షా యాభై వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు.

"ప్రజా పాలన-ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

మిగతా 2లో





## రేవంత్ ఏనాటికైనా బీజేపీ మనిషే

- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్ ముసుగు తొలగించండి అంటూ ప్రజలకు పిలుపు
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తీవ్ర విమర్శలు
- పోచారం చేరికపై ప్రశ్నల వర్షం

**బాన్సువాడ, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీ మనిషేనని, ఆయన ఎప్పటికీ కాంగ్రెస్ నేత కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బాన్సువాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి కప్పుకున్న కాంగ్రెస్ ముసుగును తొలగించి చూడాలని ప్రజలను కోరారు.

2లో

## తూప్రాన్ అభివృద్ధి గుర్తు చేసుకోండి: హరీష్ రావు

- రోడ్ షోతో హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం
- కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపు



**తూప్రాన్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తూప్రాన్ మున్సిపాలిటీలో పర్యటించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శనివారం అల్లాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన ఆయన, అక్కడి నుంచి తూప్రాన్ బస్టాండ్ వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ తూప్రాన్ అభివృద్ధిని గుర్తు చేస్తూ ప్రజలను ఆలోచించాలన్నారు.

ఒకప్పుడు తూప్రాన్‌లో మూడు రోజులకోసారి మాత్రమే మంచినీరు వచ్చేదని, అప్పట్లో గీతారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బిందెలతో

మిగతా 2లో

## తొర్రూర్‌ను నందనవనంగా
# తీర్చిదిద్దుతా
### మంత్రి పొంగులేటి

- వర్ధన్నపేటకు అదనంగా పది కోట్లు
- రోడ్ షోలు, కార్నర్ మీటింగ్లతో జోరుగా ప్రచారం
- హస్తం గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- అభివృద్ధి, సంక్షేమ హామీలపై స్పష్టత
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**తొర్రూర్ / వర్ధన్నపేట, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

తాను దత్తత తీసుకున్న తొర్రూర్ మున్సిపాలిటీ పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతానని, వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి కోసం అదనంగా పది కోట్ల రూపాయలు మంజూరు చేయిస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఉదయం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, నాగరాజు, పీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న వార్డు అభ్యర్థులు, మిత్రపక్ష సీపీఐ నాయకులు,





## బ్యాక్‌డోర్ నియామకాల ఆరోపణలు..

- నిరుద్యోగుల ఆగ్రహం
- బ్యాక్‌లాగ్ పోస్టుల పేరుతో అక్రమ భర్తీ?
- జిల్లా స్థాయిలో దొడ్డిదారిన నియామకాలు
- లక్షల రూపాయల వసూళ్లపై ఆరోపణలు
- కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, 2026 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రంలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ పేరుతో దొడ్డిదారిన నియామకాలు జరుగుతున్నాయని కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, విద్య తదితర శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు.

2లో


## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లే

- ఫైర్ డీజీ విక్రమ్ సింగ్
- సీజ్డ్ ప్రాపర్టీస్ గది పూర్తిగా దగ్ధం
- భవనం పాతదే, స్విచ్ బోర్డు వద్దే మంటలు
- హైదరాబాద్‌లో అన్ని భవనాల తనిఖీకి ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ స్పందించారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం షార్ట్ సర్క్యూట్‌గానే భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లోని సీజ్డ్ ప్రాపర్టీస్ గదిలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా, ఆ గది పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ పరిస్థితిని సమీక్షించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## గోదావరి జలాలతో తాండూరు–పరిగి–వికారాబాద్‌కు

# సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు అవసరమైన ప్రణాళికలను తక్షణమే చేపడతామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

తాండూరు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయడంతో పాటు కాగ్నా నది నుంచి తాగునీటిని అందించే కార్యక్రమాలను అమలు చేస్తామని సీఎం తెలిపారు. సంవత్సరం తిరిగేలోపు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ, అక్కడి నుంచి తాండూరు వరకు రహదారి నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు రేడియల్ రోడ్లను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో వికారాబాద్ జిల్లా అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారబోతోందని సీఎం పేర్కొన్నారు. మౌలిక వసతులు, రవాణా సౌకర్యాల అభివృద్ధితో జిల్లా రూపురేఖలు మారతాయని అన్నారు. అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, ప్రజలంతా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో రైతాంగం, నిరుద్యోగ యువత, మహిళలను ప్రాధాన్యంగా పెట్టుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలోని ఆరు వేల ఆరు వందల యాభై స్వయం సహాయక



సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద ఐదు వందల అరవై ఏడు కోట్ల అరవై తొమ్మిది లక్షల రూపాయల చెక్కును మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ బహిరంగ సభలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ–ఆంధ్రప్రదేశ్‌కు

# గౌరవం తెచ్చిన కేడెట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఎన్సీసీ కేడెట్లు ప్రదర్శించిన క్రమశిక్షణ, అంకితభావం, ఉత్తమ ప్రదర్శన ప్రశంసనీయమని అన్నారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో వారి పాల్గొనడం జాతీయ సేవ, ఐక్యత, నాయకత్వంపై ఉన్న బలమైన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు గౌరవం తీసుకొచ్చిన కేడెట్లను, అలాగే వారికి మార్గనిర్దేశం చేసిన ఇన్‌స్ట్రక్టర్లను గవర్నర్ అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.



# తూప్రాన్ అభివృద్ధి గుర్తు చేసుకోండి: హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

అడ్డం పడి ప్రజలు నిరసనలు తెలిపిన పరిస్థితులు ఉన్నాయని హరీష్ రావు గుర్తు చేశారు. కానీ కేసీఆర్ వచ్చాక ప్రతి ఇంటికి నల్లా ఏర్పాటు చేసి ఆడబిడ్డల నీళ్ల కష్టాలు తీర్చారని అన్నారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీ చేయడం, ఆర్డీవో కార్యాలయం తీసుకురావడం, ఫోర్ లైన్ రోడ్లతో పట్టణాన్ని హైవేలా మార్చింది కారు గుర్తే అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రాకముందు తూప్రాన్‌కు పిల్లనివ్వాలంటే నీళ్లు మోపిస్తారనే భయం ఉండేదని, ఇప్పుడు తూప్రాన్‌కే పిల్లనివ్వాలనుకునే పరిస్థితి వచ్చిందన్నారు. పది లక్షలు లేని భూమిని కోటి రూపాయల విలువకు తీసుకువచ్చింది కేసీఆర్ పాలనేనని చెప్పారు. అయితే రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు పాతాళానికి పడిపోయి, బంగారం ధరలు ఆకాశానికి చేరాయని విమర్శించారు.



తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, నర్సారెడ్డి–మైనంపల్లి మధ్య పోరులో ప్రజలను బలి చేస్తున్నారని ఆరోపించారు. "మీకు ఆధిపత్య రాజకీయాలు కావాలా? లేక అభివృద్ధి కావాలా?" అని ప్రజలను ప్రశ్నించారు. రెండేళ్లుగా తూప్రాన్ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని, రోడ్లపై గుంతలు పడ్డా డాంబర్ వేసే దిక్కు లేదని మండిపడ్డారు.

కేసీఆర్ పాలనలో పంట పంటకు రైతుబంధు అందేదని, కరోనా కష్టకాలంలో కూడా ఆపలేదని గుర్తు చేశారు. కానీ రేవంత్ రెడ్డి రెండు రైతుబంధులు ఎగ్గొట్టారని, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, గొర్రెల పంపిణీ, చేప పిల్లలు, దళిత బంధు అన్నీ బంద్ పెట్టి ప్రజలను గోస పెడుతున్నారని విమర్శించారు. "సద్ది తిన్న రేవు తలవాలి.. మనకు అన్నం పెట్టిన కేసీఆర్‌ను మర్చిపోవద్దు" అని పిలుపునిచ్చారు. బీజేపీపై కూడా విమర్శలు చేసిన హరీష్ రావు, తూప్రాన్‌కు ఒక్క హాస్పిటల్ అయినా కట్టించారా? కల్యాణ లక్ష్మి ఇచ్చారా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వలేదని, పువ్వు గుర్తుకు ఓటేసినా, ఓటును మోరీలో వేసినా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు అడిగితే సీఎం మాట్లాడే భాష సరికాదని, ఇలాంటి ముఖ్యమంత్రికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించాలన్నారు. రెండేళ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ, తూప్రాన్ అభివృద్ధి బాధ్యత తనదేనని, ఏ పని ఉన్నా చేసి పెడతానని హరీష్ రావు ప్రజలకు భరోసా ఇచ్చారు.

## కాంగ్రెస్ పాలనలోనే పట్టణాల సమగ్ర

# అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)



పట్టణ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని చెప్పారు. యువత భవిష్యత్తుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆయన తెలిపారు. ఇప్పటికే డెబ్బై వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. దీని ద్వారా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కొన్ని వర్గాలు తప్పుడు ప్రచారం చేస్తున్నప్పటికీ, ప్రజల నుంచి లభిస్తున్న బలమైన స్పందన కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. సమగ్ర పట్టణాభివృద్ధి, సమాన అవకాశాల కల్పన అనే కాంగ్రెస్ దృక్పథానికి ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం దక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## తొర్రూర్‌ను నందనవనంగా

# తీర్చిదిద్దుతా

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్ల ద్వారా ప్రజలను కలుసుకుని ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తొర్రూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్న బినామీ కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల అనేక అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా మిగిలిపోయాయని మంత్రి విమర్శించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆ కాంట్రాక్టును రద్దు చేయడమా, లేక పనులు పూర్తిచేయించడమా అన్న పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు. అలాగే వర్ధన్నపేట పట్టణ అభివృద్ధికి అదనంగా పది కోట్ల రూపాయలు మంజూరు చేయించే బాధ్యతను కూడా తానే భరిస్తానని తెలిపారు.

మున్సిపాలిటీలో కలిపిన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయిస్తానని, తన సొంత నిధులతో ఎల్లమ్మ గుడి నిర్మాణం చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని గుర్తు చేశారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు.

అరుదైన పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తనదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రెండో విడత ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఇంకా మూడు విడతల్లో అర్హులైన ఆడబిడ్డలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రజలంతా ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ, తొర్రూర్, వర్ధన్నపేట పట్టణాల అభివృద్ధి బాధ్యత తమదేనని భరోసా ఇచ్చారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్లే

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ఫోరెన్సిక్ భవనం చాలా పాతదని, దీనిని పద్దెనిమిది వందల ఎనభైయేళ్లలో నిర్మించారని తెలిపారు. చివరి గదిలో ఉన్న స్విచ్ బోర్డు వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే మంటలు చెలరేగాయని చెప్పారు.





అక్కడి నుంచి మంటలు వేగంగా వ్యాపించినప్పటికీ, సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారని వివరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు.

ఎండాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని ఫైర్ డీజీ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలన్నింటినీ తనిఖీ చేస్తామని తెలిపారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటామని, సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని ఆయన వెల్లడించారు.

## బ్యాక్‌డోర్ నియామకాల ఆరోపణలు..

(మొదటి పేజీ తరువాయి)



నియామకాల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, నిబంధనలను పక్కన పెట్టి అక్రమంగా చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. ఒక్కో ఉద్యోగానికి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్న నిరుద్యోగుల ఆవేదనను ఆమె ప్రస్తావించారు. అర్హత, పరీక్ష, ప్రతిభ వంటి ప్రమాణాలను విస్మరించి నియామకాలు జరగడం వల్ల నిజమైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో దొడ్డిదారిన నియామకాలు జరుగుతున్నాయన్న సమాచారం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.

ఈ విధమైన చర్యల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆమె మండిపడ్డారు. ఉపాధి ఆశతో ఎదురు చూస్తున్న యువతకు ప్రభుత్వ వైఖరి నిరాశనే మిగులుస్తోందని, ఉద్యోగ భర్తీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమ నియామకాల వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన నిరుద్యోగులు, యువతనే ఇప్పుడు ప్రభుత్వం మోసం చేస్తోందని ఆమె ఆరోపించారు. ఉద్యోగాల పేరిట ఆశలు చూపి చివరికి యువత నోట్లో మట్టి కొట్టినట్లవుతోందని వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ నియామకాలను నిలిపివేసి, న్యాయబద్ధమైన, పారదర్శకమైన విధానంతో మాత్రమే ఉద్యోగ భర్తీ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## జవహర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన వేదిక లభిస్తుందని మంత్రి తెలిపారు. బస్తీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గౌరవ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్, గౌరవ ఎమ్మెల్యే ముఠా గోపాల్తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని, జవహర్‌నగర్‌ను మరింత మెరుగైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



# రేవంత్ ఏనాటికైనా బీజేపీ మనిషే

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ ముమ్మాటికి బడే భాయ్ తమ్ముడేనని విమర్శించారు. రాష్ట్రంలోని మైనారిటీలు, మత రాజకీయాలను వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రేవంత్ రెడ్డి లోపల ఉన్న బీజేపీ నాయకుడిని గుర్తించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ఎప్పటికీ కాంగ్రెస్ మనిషి కాలేదని, ముందు నుంచే బీజేపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్నాం కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలన్న కాంగ్రెస్ వాదన అర్థరహితమని, గత రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న రెండేళ్ల తర్వాత మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, అప్పట్లో గతంలో మాదిరిగా పట్టణాలను కాంగ్రెస్ కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. మైనారిటీలకు, బీసీలకు భారీ బడ్జెట్ ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఎన్నికల హామీలు అమలైతే వాటి లబ్ధిదారులే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, మిగిలినవారు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంపై కేటీఆర్ తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో రేవంత్ రెడ్డి పోచారంపై చేసిన తీవ్ర వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పులను సభలో వినిపించారు. అప్పట్లో పోచారాన్ని, ఆయన కుటుంబాన్ని దూషించిన వ్యక్తితోనే ఇప్పుడు ఆయన ఎందుకు కాంగ్రెస్ సంకన చేరారని ప్రశ్నించారు. వెంకటేశ్వరుని సాక్షిగా జీవితాంతం కేసీఆర్ వెంట ఉంటానని చెప్పిన పోచారం మాటలను కూడా ప్రజల ముందుంచారు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతుకుల కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరినా, వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నారని కేటీఆర్ అన్నారు. బాన్సువాడ ప్రజలు గులాబీ జెండా ఎగరాలని కోరుకుంటున్నారని చెప్పారు. దమ్ముంటే పోచారం శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేసి ప్రజల వద్దకు రావాలని సవాల్ విసిరారు. ప్రజలు ఎవరి వైపు ఉన్నారో తేల్చుకుంటారని స్పష్టం చేశారు.



తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం

- **22వ వార్డు అభ్యర్థి అరుణకు మద్దతుగా పెద్దమందడి మండల నాయకుల విస్తృత ప్రచారం**

**వనపర్తి ఫిబ్రవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దమందడి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి పట్టణం 22వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ఏ. అరుణ (మెకానిక్ శ్రీను) కి మద్దతుగా ప్రజలను కలిశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కారు గుర్తుపై ఓటు వేసి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ప్రతి గడప వద్ద ప్రజల నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిపై అపారమైన అభిమానాన్ని చూశామని, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ వ్యవసాయం పచ్చగా కళకళలాడుతోందని పేర్కొన్నారు. ప్రజలు స్పష్టంగా కారు గుర్తుకే మా ఓటు అని చెబుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి గ్రామ కమిటీ అధ్యక్షుడు సేనాపతి, ఉపాధ్యక్షులు జంగం రమేష్,పురుషోత్తం రెడ్డి, అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి , హరికుమార్ రెడ్డి , ఆశిరెడ్డి , పాల్గొన్నారు. అలాగే వార్డు మెంబర్లు కొమ్ము బ్రహ్మయ్య ,కొమ్ము విష్ణు , సింగిరెడ్డి వెంకటస్వామి, గోవర్ధన్ రెడ్డి , తదితరులు ఈ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.



## అమ్మపల్లి గ్రామంలో పోషకాహార సరుకుల పంపిణీ

- **మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులు, గర్భిణీ,బాలింతలకు సరుకులు**

**పెద్దమందడి,ఫిబ్రవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు, గర్భిణీ మహిళలకు, బాలింతలకు పోషకాహార సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అమ్మపల్లి గ్రామ సర్పంచ్ మాధవి వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లలకు, గర్భిణీ బాలింతలకు బియ్యం, కందిపప్పు, నూనె, పాలు, గుడ్లు పంపిణీ చేశారు. అలాగే ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు బాలామృతం, 25 రోజులకు గానూ 16 గుడ్లు అందజేశారు. ఇంటికి తీసుకెళ్లే రేషన్ విధానంలో సరుకులను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని సమగ్ర శిశు అభివృద్ధి పథకం పర్యవేక్షకురాలు నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.చిన్నారుల బరువులు, ఎత్తులు కొలిచి నమోదు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవి , సమగ్ర శిశు అభివృద్ధి పథకం పర్యవేక్షకురాలు నాగరాణి ,లబ్ధిదారులు, అంగన్వాడీ టీచర్లు శారద, సువర్ణ, మంజుల, చెన్నమ్మ, బాలమణి, గ్రామస్తులు, యువజన సభ్యులు పాల్గొన్నారు.




## రమాబాయి అంబేద్కర్ జీవితం మహిళలకు ఆదర్శం

- **సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్**

**వనపర్తి,ఫిబ్రవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

రమాబాయి అంబేద్కర్ జీవితం మహిళలందరికీ ఆదర్శంగా నిలవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. రమాబాయి అంబేద్కర్ జయంతిని జై భీమ్ స్వచ్ఛంద సంఘం అధ్యక్షులు బండారు శ్రీనివాస్ అధ్యక్షతన ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. రమాబాయి అంబేద్కర్ చిన్న సహకారంతోనే విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి గొప్ప స్థాయికి చేరుకున్నారని తెలిపారు. మహిళలు రమాబాయి అంబేద్కర్‌లా కుటుంబ సభ్యులకు సహకారం అందిస్తే, కుటుంబాలు ఉన్నత స్థానాలకు చేరుకుంటాయని ఆయన అన్నారు. చావు నీది, పుట్టుక నీది, బ్రతుకంతా సమాజానిది అనే ఆదర్శ వాక్యాన్ని జీవితాంతం ఆచరించిన రమాబాయి అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరూ అనుసరించాల్సినదిగా ఉందని శంకర్‌గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జై భీమ్ సొసైటీ అధ్యక్షులు బండారు శ్రీనివాస్, కవి జనజ్వాల, గంధం నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, స్వామి, గంధం గోవింద్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికలకు రాజకీయ వేడి.!

- **కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరుపై అంచనాలు.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**





ఈ నెల 11వ తేదీన జరగనున్న సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మధ్య పోటీ హోరాహోరీగా సాగనుందన్న అంచనాలు ప్రజల్లో బలపడుతున్నాయి. మున్సిపాలిటీ పీఠం ఎవరి ఖాతాలో చేరుతుందోనన్న అంశంపై పట్టణవ్యాప్తంగా చర్చలు, గుసగుసలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రతి వార్డులో పరిస్థితులు భిన్నంగా ఉండటంతో ఎన్నికల ఫలితాలపై స్పష్టమైన అంచనాకు రావడం కష్టంగా మారింది. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, గత పాలనపై ప్రజల అభిప్రాయాలు ఓటింగ్‌పై ప్రభావం చూపనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ స్వయంగా ప్రచార వ్యూహాలపై దృష్టి సారించారు. మున్సిపాలిటీపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ప్రతి వార్డును సమీక్షిస్తూ, కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన అనుభవాన్ని ఉపయోగించుకుంటూ పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, వార్డు వార్డుగా పరిస్థితులను అంచనా వేయడం జరుగుతోంది. ప్రతి కౌన్సిలర్ అభ్యర్థితో సంప్రదింపులు జరుపుతూ స్థానిక సమస్యలు, ఓటర్ల స్పందనపై సమాచారం సేకరిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. గతంలో మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పిస్తోంది. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల అంశాలను ప్రధానంగా ముందుకు తీసుకెళ్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

ఈ నేపథ్యంలో సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికలు స్థానిక సంస్థ ఎన్నికలకే పరిమితం కాకుండా, రెండు ప్రధాన పార్టీల ప్రతిష్ఠకు పరీక్షగా మారాయని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ ప్రచారం మరింత ఉద్ధృతం కానుండగా, సత్తుపల్లి రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది.

# పామిరెడ్డిపల్లిలో కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- **88 మంది లబ్ధిదారులకు ఉచిత చికిత్స, మందులు పంపిణీ**

**పెద్దమందడి,ఫిబ్రవరి7(తెలంగాణ ముచ్చట్లు):**



పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాయి నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు ప్రతి నెల గ్రామపంచాయతీ పరిధిలో నిరుపేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామ సర్పంచ్ మదిర మంజుల శ్రీశైలం తెలిపారు.ప్రజల వద్దకే పాలన అనే లక్ష్యంతో వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి ఆదేశాల మేరకు ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 88 మంది లబ్ధిదారులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.వారికి అవసరమైన చికిత్సతో పాటు మందులను సాయి నేత్రాలయ హాస్పిటల్ సిబ్బంది ఉచితంగా పంపిణీ చేశారు.ప్రతి నెల ఏదో ఒక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి కి, గ్రామ సర్పంచ్ మదిర మంజుల శ్రీశైలం గారికి, సాయి నేత్రాలయ హాస్పిటల్ సిబ్బంది సంతోష్ యాదవ్ కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మదిర మంజుల శ్రీశైలం, ఉప సర్పంచ్ పానుగంటి రాములమ్మ, మాజీ సర్పంచ్ తిక్కన్న, కాంగ్రెస్ నాయకులు ఎస్. మన్నెపు రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రఘు గౌడు, ఏఎన్ఎం కౌసల్య, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పైథాన్ శిక్షణకు ప్రాధాన్యం.!

- **సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**





మండల పరిధిలోని బి గంగారం, సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న అన్ని ఇంజనీరింగ్ బ్రాంచీల విద్యార్థినీ, విద్యార్థులకు పైథాన్‌పై నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ శిక్షణ ఫిబ్రవరి 5న ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమానికి ట్రైనర్లుగా డాక్టర్ షేక్ రసూల్ (అసోసియేట్ ప్రొఫెసర్, ఈసీఈ, సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాల, సికింద్రాబాద్), డాక్టర్ కె. విజయ్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈసీఈ, అమృత విశ్వ విద్యాపీఠం, అమరావతి), డాక్టర్ యస్. రాజ్‌కుమార్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్, అమృత విశ్వ విద్యాపీఠం, అమరావతి), తాటికొండ నాగ సాయి (స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, అమృత విశ్వ విద్యాపీఠం, అమరావతి)లు విద్యార్థులకు పైథాన్‌పై ప్రాయోగిక అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు అవసరమైన ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు పెంపొందించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ, కార్పొరేట్ రంగాల్లో అవకాశాలు సాధించేందుకు పైథాన్ కీలకంగా మారుతోందని వివరించారు. కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను ఉద్యోగ రంగానికి అనుసంధానం చేయగలగాలని సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నైపుణ్యం మరింత పెరుగుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ, పైథాన్ ఒక బహుళ ప్రయోజనాలున్న ఉన్నత స్థాయి ప్రోగ్రామింగ్ భాషగా వివిధ రంగాల్లో విస్తరిస్తోందన్నారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే ఇలాంటి ప్రత్యేక శిక్షణ అందించడం వల్ల విద్యార్థులు ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, సాయిస్ఫూర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మొదటి సంవత్సరం విభాగాధిపతి, సైన్స్ & హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, సైన్స్ & హ్యూమానిటీస్ విభాగం అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## సీఎం కప్ క్రీడా పోటీలకు ఘనంగా శ్రీకారం

- **బి గంగారంలో నియోజకవర్గ స్థాయి పోటీల ప్రారంభం.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

మండల పరిధిలోని బి గంగారం గ్రామంలోని శ్రీ దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు శనివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ వైస్ ఎంపీపీ దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన), గంగారం గ్రామ సర్పంచ్ కాకర్ల రేవతి, ఉప సర్పంచ్ బెజవాడ రాధ, ఎంఈఓ, నియోజకవర్గంలోని క్రీడాకారులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, దాసరి మధు అన్న యువసేన సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కీసరగుట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన మల్కాజిగిరి సిపి

**కీసరగుట్ట, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసరగుట్టలో ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం పరిశీలించారు. ఆలయ పరిసరాలు, దర్శన మార్గాలు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో చలువ పందిళ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు.పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో దర్శనం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిపి అవినాష్ మహంతి తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం

- రూ.30 కోట్లతో ఉప్పల్ నల్లచెరువు తరహాలో అభివృద్ధి

నాచారం, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ హెచ్ఎంటి నగర్‌లోని పెద్ద చెరువును సుందరీకరించేందుకు ప్రభుత్వం రూ.30 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టింది. ఉప్పల్ నల్లచెరువును ఆదర్శంగా తీసుకుని ఈ చెరువును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు.
సుందరీకరణకు సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్‌ల తయారీ కోసం కాంట్రాక్టు పొందిన ఏజెన్సీ ఇప్పటికే చెరువు పరిసరాల్లో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సర్వే పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. మొదటగా చెరువులోకి మురుగునీరు ప్రవేశించకుండా డైవర్షన్ నాలా నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, గ్రీనరీ డెవలప్‌మెంట్, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, చెరువు మధ్యలో ఐలాండ్ నిర్మాణం వంటి విస్తృత స్థాయి సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ అభివృద్ధి పనులతో హెచ్ఎంటి నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు విశ్రాంతి, వ్యాయామం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు లభించనుందని కార్పొరేటర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, యాదగిరి రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## నాచారం డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభం

నాచారం, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా రూ.40 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించారు.
భవాని నగర్ రోడ్ నెంబర్-1లో, వి.ఎస్.టి కాలనీలో టెంపుల్ ఎదురుగా ఉన్న రెండు లైన్లలో, అలాగే ఎర్రగుంట ప్రాంతంలోని లాల్ బహుదూర్ శాస్త్రి సామాజిక భవనం రోడ్డులో ఈ భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా వర్షాకాలంలో ఏర్పడే నీటి నిల్వలు, పారిశుధ్య సమస్యలు పరిష్కారమై ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించబడుతుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరాజ్, భవాని నగర్-వి.ఎస్.టి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బారాసా నాయకులు, కార్యకర్తలు, అలాగే ఎర్రగుంటవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ప్రచారంలో దూసుకుపోతున్న.. ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు 20 వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారలో ఆమెకు మంచి స్పందన లభిస్తుంది. ఈ సందర్భంగా ఉండ్రు వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సేవ లక్ష్యంగా ముందడుగు తో సేవ అనేది మాటల్లో కాదు ఆచరణ చూపించాలని నమ్మకంతో ప్రజల మధ్య జీవిస్తూ ప్రజల కోసమే పనిచేస్తూ ఇప్పుడు ప్రజల ఆశీస్సులతో ఎన్నికల ద్వారా మరింత విస్తృతంగా సేవ చేయలేని సంకల్పం తో 20 వార్డులో కౌన్సిలర్ అభ్యర్థిగా ముందుకు వస్తున్నానని ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో సేవ చేయటానికి ఒక మార్గం లభిస్తుందని ఆశతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని నన్ను ప్రతి ఒక్కరు ఆశీర్వదించి మీ పవిత్రమైన ఓట్లను హస్తం గుర్తుపై వేసి నన్ను గెలిపించాలని ఆమె ఓటర్లను కోరుతున్నారు. సామాజిక కార్యకర్తగా లయన్స్ క్లబ్ ద్వారా అనేక



సేవలు అందించి సేవా విలువలను ప్రవేశపెట్టాలని లక్ష్యంతో ఎన్నికల్లో పాల్గొంటున్నానని ఆమె తెలిపారు సేవ అనేది మాటల్లో కాదు ఆచరణలో చూపించాలి అనే నమ్మకంతో గత లైన్స్ క్లబ్ ద్వారా ప్రజల మధ్య జీవిస్తూ ప్రజల కోసమే పని చేస్తున్నాని ఇప్పుడు 20వ వార్డులో ప్రజల ఆశీస్సులతో మున్సిపల్ ఎన్నికల ద్వారా మరింత విస్తృతంగా సేవ చేయాలనే సంకల్పంతో పోటీ చేస్తునాని ఉండ్రు వరలక్ష్మి తెలిపారు. ప్రజల ఆశీస్సులు తప్పక లభిస్తాయని 20వ వార్డు ప్రజలు విశ్వసించి మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నాను వరలక్ష్మి తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు యువత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ల కుటుంబాలకు టీజీఎస్ఆర్టీసీ భరోసా

- ఉచిత ప్రమాద బీమా ద్వారా రూ.కోటి ఆర్థిక సహాయం

కుషాయిగూడ, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):

రోడ్డు ప్రమాదాల్లో విధులకు వెళ్తూ అకాల మరణం చెందిన ఉద్యోగుల కుటుంబాలకు టీజీఎస్ఆర్టీసీ అండగా నిలిచింది. కుషాయిగూడ, ఉప్పల్ డిపోలకుచెందిన ఇద్దరు డ్రైవర్లు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా, వారి కుటుంబాలకు ఉచిత ప్రమాద బీమా పథకం కింద రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసి భరోసా కల్పించింది.కుషాయిగూడ డిపో డ్రైవర్ ఎ.వెంకటేష్, ఉప్పల్ డిపోకు చెందిన డి.ఆర్. గౌడ్లు వేర్వేరు సందర్భాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. ఈ కష్ట సమయంలో టీజీఎస్ఆర్టీసీ



ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న యూబీఐ సూపర్ సాలరీ సేవింగ్స్ అకౌంట్ వారికి ఎంతో ఉపయోగపడింది.సంస్థ సూచనల మేరకు ఉద్యోగులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సూపర్ సాలరీ సేవింగ్స్ అకౌంట్ తెరిచి రూపే కార్డులు తీసుకోవడంతో ఉచిత ప్రమాద బీమా సౌకర్యం వర్తించింది. ఈ పథకం కింద ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు యూబీఐ రూ.కోటి వరకు ఆర్థిక సహాయం అందిస్తోంది.ఈ మేరకు శనివారం బస్సు భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమ్రేష్ ప్రసాద్, బ్యాంక్ సిబ్బందితో కలిసి టీజీఎస్ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి, ఐపీఎస్ బాధిత కుటుంబాలకు రూ.కోటి విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా వై. నాగిరెడ్డి మాట్లాడుతూ, తమ తప్పు లేకున్నా రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్లు అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి టీజీఎస్ఆర్టీసీ ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని, పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబాలకు సంస్థ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఆపద సమయంలో ఉపయోగపడే పథకాలను నిర్లక్ష్యం చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవకాశం కల్పించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డ్రైవర్ ఎ. వెంకటేష్ తన ఇంటి నుంచి విధుల కోసం ద్విచక్ర వాహనంపై కుషాయిగూడ డిపోకు వస్తుండగా, కీసర సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ వి. వేణుగోపాల్‌తో పాటు బస్సు భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)

వైరా మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4 వార్డు నిమ్మ తోట శ్రావణి . 7 పణితి సైదులు . 9. కట్ల సంతోష్ 17 బత్తుల సుమతి.18 గోరింట్ల శ్రీదేవి .19. వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి చింత నిప్పు సులోచన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే రామదాసు నాయక్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పీసీసీ కార్యదర్శి కట్ల రంగన్నతో కలిసి వార్డులలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే రామదాసు నాయక్ కు అభ్యర్థులకు ప్రజలు అడుగడుగున జననీరాజనాలు పలికారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించే బాధ్యత మాది అని ప్రజలు నినాదాలు చేయడంతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వివిధ వార్డులలోని ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు పనులు చేసే వారికి మాత్రమే ప్రజల నుండి ఇటువంటి మద్దతు ఉంటుందని ఎప్పుడు ప్రజలు అటువంటి వారి పక్కనే నిలుస్తారని అటువంటి వారిని కోరుకుంటారని ఆయన అన్నారు ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం మంత్రులు ప్రజలను పట్టించుకోలేదని అందుకే గడిల పాలనను బద్దలు కొట్టి ప్రజా పాలన తెచ్చుకున్నారని ప్రజా





పాలనలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కోరిక మేరకు సామాన్య పేద మధ్యతరగతి వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఆయన అన్నారు కొందరు ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు కళ్ళు తెరిచారని అధికారంలో ఉన్నప్పుడు కళ్ళు మూసుకుపోయి అహంకారంతో ప్రజలను పట్టించుకోని వాళ్ళు ఇవాళ ఎన్నికలు రాగానే మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేయని వాళ్ళు ఇవాళ ఇన్చార్జిలుగా వచ్చి ఏం పనులు చేస్తారని ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపిస్తారని ఆయన సూటిగా ప్రశ్నించారు. మాజీ మంత్రి బాకీ కార్డు పేరుతో ప్రజలకు మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని అటువంటి అబద్ధపు మాటలు ప్రజలు నమ్మరని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తామని ప్రజలకు బాకీ ఉన్న మాట వాస్తవమని త్వరలోనే మిగిలిన పథకాలు కూడా అమలు చేస్తామని కానీ అధికారం లేనివాళ్లు ఐపి పెట్టి పోయిన వాళ్ళు దివాలా తీసిన వాళ్ళు వైరా మునిసిపాలిటీలో ఏమి అభివృద్ధి పనులు చేస్తారో చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ఇందిరమ్మ ఇల్లు ఉచిత కరెంటు రైతులకు రుణమాఫీ పండించిన వరి ధాన్యానికి క్వింటాకు 500 రూపాయల బోనస్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేశామని పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే చూసి ఓర్వలేక తిరిగి అధికారం రాదని మనోవేదనతో కారు కూతలు కూస్తున్నారని ఈనెల 13వ తేదీన వచ్చే ఎన్నికల ఫలితాలతో ఆ నోరు మూసుకోవాల్సి వస్తుందని ఫలితాల తర్వాత నాయకులు కంటికి కూడా కనపడని ఆయన అన్నారు నూటికి నూరు శాతం వైరా మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్ల గంగారావు. మండల పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సూతకాని జైపాల్. యువజన విభాగం అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖమ్మం మీరా ఎస్ కే బీభా. వేముల రత్నాకర్ కట్ల నాగరాజు చెరుకూరి కిరణ్ పాణ్యం భాస్కర్ గుత్తికొండ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.





# టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ - 2843 యూనియన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమం

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- మొక్కలు నాటిన టి డబ్ల్యూ జేఎఫ్ ప్రెస్ క్లబ్ బృందం

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 07(తెలంగాణ ముచ్చట్లు)

పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి కనీస బాధ్యత అని, వనజీవి రామయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 యూనియన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అర్బన్ పార్క్ (వేలుగుమట్ల)లో టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 ప్రెస్ క్లబ్ అధ్యక్షతన ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథుల రాక వన ప్రేమికుల సందడి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫారెస్ట్ అధికారులు సిబ్బంది మరియు యూనియన్ బాధ్యులు సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అరవపల్లి నాగేష్ ముఖ్య ఆహ్వానం పలికారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం మొక్కలనికొనియాడారు.ప్రాణవాయువు మొక్కలు కేవలం ఆక్సిజన్ ఇవ్వడమే కాకుండా, భూతాపాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షిస్తాయని తెలిపారు.వర్షాలు అడవులు,చెట్లు సమృద్ధిగా ఉంటేనే సరైన సమయంలో వర్షాలు కురుస్తాయని, తద్వారా వ్యవసాయం బాగుంటుందని గుర్తుచేశారు.వనజీవి స్ఫూర్తి: పద్మశ్రీ అవార్డు గ్రహీత, కోటి మొక్కల ప్రదాత వనజీవి రామయ్య గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టానని ఆయన వివరించారు.ప్రభుత్వానికి విన్నపం: మున్సిపల్ అధికారులు భవన నిర్మాణాలకు ప్లానింగ్ ఇచ్చే సమయంలో,కనీసం ఒకటి లేదా రెండు గజాల స్థలాన్ని మొక్కల కోసం కేటాయించాలనే నిబంధన పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు. ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న పెద్ద పెద్ద యూనియన్ నాయకులు కూడా చేయని ఆలోచనను శ్రీనివాస్ చేసి చూపించారని, సామాజిక బాధ్యత గల విలేకరిగా ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ప్రాముఖ్యతను వివరించిన ప్రధాన కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే క్రమంలో ఇంజనీర్లు, ప్లానర్లు ప్లాట్లు చేసేటప్పుడు చెట్లను నరికివేయడం రోడ్డు విస్తరణ పనులు చేసినప్పుడు కూడా చెట్లను తొలగించడం బాధాకరమని, ఆ స్థానంలో తిరిగి మొక్కలు నాటేలా ప్లానింగ్ ఉండాలని సూచించారు. ప్రతి మనిషి తమ ఇంట్లో జరిగే పుట్టినరోజులు, పెళ్లిళ్లు వంటి శుభకార్యాల సందర్భంగా ఒక మొక్క నాటే సంప్రదాయాన్ని మొదలుపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన జిల్లా నాయకులకు, తోటి విలేకరులకు, సహకరించిన అధికారులకు అంతోటి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు పాల్గొని, తాము నాటిన మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ లో వివాహ దినోత్సవ సందర్భంగా యూనియన్ నాయకులు విలేకరులు కమిటీ సభ్యుల మధ్య కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజే హెచ్ 2843 జిల్లా కోశాధికారి ఆరోపణ నగేష్ ఖమ్మం జిల్లా మీడియా ఫోటోగ్రాఫర్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్ టీబీజేఏ జిల్లా కోశాధికారి శ్రీధర్ పట్టణ అధ్యక్షులు వెలుగోటి వెంకట్ నగర అధ్యక్షులు గంటల కుమార్ పట్టణ ఉపాధ్యక్షులు రాకేష్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి మల్లెల శిల్ప పట్టణ సహాయ కార్యదర్శి చెన్నం శెట్టి రాంబాబు ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్ పోయెలబోయిన శ్రీను, కొండ శ్రీనివాస్ షేక్ మీరా సునీత తేళ్ల శ్రీనివాసరావు పాగ యోనా తదితరులు ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ అమలు

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 7(తెలంగాణ ముచ్చట్లు)**

ఫిబ్రవరి 11 న జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 9 తేది నుండి 13 వ తేదిన ఓట్ల లెక్కింపు ఫలితాలు ప్రకటించే వరకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండరాదని పెర్కొన్నారు. అదేవిధంగా ఎవరూ రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా/ అతిక్రమించినా, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని



తెలిపారు.

ఎక్కడైనా డబ్బు, మద్యం ఉచిత కానుకల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంతో పాటు ఓటర్లను భయబ్రాంతులకు గురి చేయకూడదని తెలిపారు.

విధి నిర్వహణలో ఉన్న పోలీసు / ఫారెస్ట్/ కేంద్ర బలగాలు హోంగార్డులు మరియు ఎస్ పి ఓ లకు నిషేధ అంక్షాలు నుంచి మినహాయింపు వుంటుందన్నారు.

ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. ఎన్నికలలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమీషనర్ తెలిపారు.

ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ... పారదర్శక ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని అన్నారు.పోలింగ్ సందర్భంగా ఓటర్లకు భద్రత రీత్యా ఎలాంటి సమస్యలు ఎదురైన డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

1. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఐదుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడటం, ఊరేగింపులు చేయడం నిషేధం.

2. పోలింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరం వరకు ఆత్మరక్షణ పేరుతో కర్రలు, తుపాకులు,మారణాయుధాలతో సంచరించడం నిషేధం.

3. బహిరంగ ప్రదేశాల్లో షామియానాలు, పందిళ్లు వంటి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడానికి అనుమతి లేదు.

4. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆంక్షల సమయంలో మైకులు, స్పీకర్ల ద్వారా పాటలు పెట్టడం, ప్రజలను ఉద్దేశించి ప్రసంగాలు చేయడం నిషిద్ధం

5 . వ్యక్తులు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, చిత్రాలు, గుర్తులు ప్రదర్శించడం, చట్టబద్ధమైన అధికారానికి భంగం కలిగించే లేదా ధిక్కరించే నేరానికి దారితీసే అవకాశం ఉన్న ఏదైనా ప్రసంగం నిషేధం.






# సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

- **కాలనీలో విస్తృతంగా పర్యటించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీలో అతి త్వరలోనే మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కాలనీలో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.శనివారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి విజయపురి కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ సదుపాయాల లోపం, సీసీ రోడ్ల అవసరం, తాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.కాలనీవాసుల సమస్యలపై స్పందించిన కార్పొరేటర్, అతి త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తామని భరోసా ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈ వెనీల్ గౌడ్, ఏఈ రాజ్ కుమార్, విజయపురి కాలనీ అధ్యక్షులు లింగారెడ్డి, దేవి రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీపతి నరేందర్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల రాజేందర్ రెడ్డి, జంగా రెడ్డి, వెంకటేష్, ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఎస్. మాధవరెడ్డి, కే. మల్లా రెడ్డి, రాణి, యమునా, అమృత, సుబ్బమ్మ, మస్తాన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బిక్షం రెడ్డి, సుదర్శన్, జి. వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బిక్షపతి, పి. శ్రీనివాస్ రెడ్డి, కే. శ్రీనివాస్, అల్లా బాషా, నాగూర్ భాష, జాంగిర్, సోమిరెడ్డి, ఎన్. రాజేందర్, బొమ్మజి రత్నం, లెక్కల అంజిరెడ్డి, బెన్నీ భీమ్ సేన్, బడుగుల ఉపేందర్ యాదవ్, సుబ్బారెడ్డి, నాగు నాయక్, మోహన్ నాయక్, అన్వర్ పాషా, కంచం మీద శ్రీనివాస్, సురేష్ యాదవ్, మౌలానా, చింతకింద శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురంలో 'ప్రసాద్ రెడ్డి' ప్రచారం!

- **వార్డుల్లో సుడిగాలి పర్యటన.. జనంతో మమేకం**
- **అండగా ఉంటాం.. అబివృద్ధి చేస్తాం : ప్రసాద్ రెడ్డి**
- **బ్రహ్మరథం పట్టిన జనం.. హోరెత్తిన ప్రచార ర్యాలీ**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 7(తెలంగాణ ముచ్చట్లు)**





మున్సిపల్ పోరులో కాంగ్రెస్ స్పీడ్ పెంచింది. శనివారం ఏదులాపురం పట్టణంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ నేత పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటనతో ఎన్నికల వాతావరణం ఫుల్ హీటెక్కింది. వార్డు వార్డుకూ తిరుగుతూ ఆయన చేసిన ప్రచారం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

**జనం మధ్యలోకి.. సమస్యల దగ్గరకు..**

ఉదయం శాబాదు నగర్ (28వ వార్డు), లిప్రసీ కాలనీ (30వ వార్డు) లలో ప్రసాద్ రెడ్డి పర్యటించారు. ప్రజలతో నేరుగా ముచ్చటించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**ర్యాలీతో దద్దరిల్లిన వీధులు**

సాయంత్రం నాయుడుపేట (3వ వార్డు) నుంచి లక్ష్మి బృందావనం కాలనీ వరకు ర్యాలీ సాగింది. ఆదిత్య నగర్, కార్తికేయ టౌన్‌షిప్ మీదుగా సాగిన ఈ ర్యాలీకి జనం వెల్లువలా తరలివచ్చారు. దారిపొడవునా మహిళలు హారతులతో ప్రసాద్ రెడ్డికి వెల్కమ్ చెప్పారు. కాంగ్రెస్ నినాదాలతో పట్టణ వీధులు మారుమోగాయి. ఏదులాపురం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చే బాధ్యత తనదని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌ఎఫ్‌ఏఈఆర్ సమావేశం విజయవంతం

- **పదవీ విరమణ అణుశక్తి ఉద్యోగుల సమస్యలపై విస్తృత చర్చ**

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కమలానగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జాతీయ అణుశక్తి పదవీ విరమణ ఉద్యోగుల వేదిక (ఎన్‌ఎఫ్‌ఏఈఆర్) సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది. అణుశక్తి శాఖ (డిఈఏ)కు చెందిన పదవీ విరమణ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. పదవీ విరమణ ఉద్యోగులను సంఘటితం చేసి, వారి న్యాయసమ్మతమైన హక్కులు, సంక్షేమ ప్రయోజనాల సాధన కోసం ఎన్‌ఎఫ్‌ఏఈఆర్ చేపడుతున్న కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సభ్యుల



హక్కుల పరిరక్షణకు వేదిక నిరంతరం కృషి చేస్తుందని నేతలు స్పష్టం చేశారు. ఎన్‌ఎఫ్‌ఏఈఆర్‌కు ముంబయి, కోటా, బరోడా, చెన్నై, మైసూరు అలాగే తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో శాఖలు ఉన్నాయని తెలిపారు.ఈ సమావేశంలో కామ్రేడ్ జైరాజ్ కె.వి. (జనరల్ సెక్రటరీ, ఎన్‌ఎఫ్‌ఏఈఆర్), కామ్రేడ్ వి. నాగేశ్వరరావు (ఏజీ ఆఫీస్ - రిటైర్డ్), కామ్రేడ్ కృష్ణ మోహన్ (ఛైర్మన్, సిసిజిఓఓ & సెక్రటరీ,




టార్ప్స్), కామ్రేడ్ జి.వి.ఆర్. కృష్ణ (కన్వీనర్, ఎన్‌ఎఫ్‌ఏఈఆర్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్), కామ్రేడ్ శంకర్ రెడ్డి (ఉపాధ్యక్షుడు) మరియు కామ్రేడ్ మల్లేశం పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో ప్రధానంగా పెన్షన్ వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఇప్పటికే ఉన్న పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ వర్తింపజేయాలని, అలాగే "నాన్‌కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు సంబంధించిన అనిధి వ్యయం" అనే అనుచిత సూచనను 8వ వేతన సంఘం (8వ సిపిసి) టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ న్యాయసమ్మతమైన డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాత్మక కార్యాచరణ చేపట్టాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశానికి పి. మల్లేశం ప్రారంభ ఉపన్యాసం చేయగా, జి.వి.ఆర్. కృష్ణ అధ్యక్షత వహించారు. ఉదయ్ బాస్కర్ వందన సమర్పణ చేశారు.



# వనపర్తి 28వ వార్డు అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థి కోట్ల శిరీష రవికి గెలిపించండి

- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి,ఫిబ్రవరి7(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి పట్టణంలోని 28వ వార్డు అభివృద్ధి కోసం మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోట్ల శిరీష రవి ని గెలిపించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఓటర్లను కోరారు.ఈ సందర్భంగా 28వ వార్డులో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం, పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొంటూ, వనపర్తి మున్సిపల్ పరిధి అభివృద్ధి చెందాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి కోట్ల శిరీష రవి ని కౌన్సిలర్‌గా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, 28వ వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమం అందించే చేతి గుర్తు పై మీ విలువైన ఓటు వేసి గెలిపించండి

**వైరా మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో 3 వ వార్డు అభ్యర్థి బొర్రా రాజశేఖర్ సతీమణి బొర్రా ఉమాదేవి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు)**

వైరా మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 3 వ వార్డులో బొర్రా ఉమాదేవి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తు ఓట్లు అభ్యర్థిస్తున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. .ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో చేతి గుర్తు పై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అధికార పార్టీకి అండగా నిలవడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా కాంగ్రెస్ పార్టీ 3 వ డివిజన్ అధ్యక్షుడు పర్స రవి, ఏదునూరి చిన్న కోటయ్య, పర్స రామకృష్ణ, ఉయ్యూరు సతీష్, చింతల నరసింహారావు, సురబి శ్రీను, ధర్నా ఉపేందర్, సురభి నాగేశ్వరరావు, పర్స రాము కాసుల అయ్యప్ప, పర్స పిచ్చయ్య, చింతల సైదులు, బొర్రా వినోద్, పర్స పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా పత్తి కుమార్ నియమకం

**కాప్రా, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**



మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా నియమితులైన పత్తి కుమార్ కి పలువురు ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ బాధ్యతాయుత మైన పదవిలో పత్తి కుమార్ సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, న్యాయబద్ధంగా పూర్తిచేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.ఎన్నికల నిర్వహణలో అనుభవంతో పాటు క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పత్తి కుమార్ ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో తన వంతు బాధ్యతను సమర్ధంగా నిర్వర్తిస్తారని పార్టీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి.

# పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

- **నాలుగు నెలల్లో రూ.14.25 లక్షల ఆదాయం**

**కుషాయిగూడ, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్. ప్రణీత్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో, గత నాలుగు నెలల కాలానికి గాను మొత్తం రూ.14 లక్షల 25 వేల 595 రూపాయల హుండీ ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఉప్పల యాదగిరి రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి మఠం వీరేశం పాల్గొన్నారు. అలాగే ఆలయ వ్యవస్థాపక సభ్యులు పల్లె సురేందర్ రెడ్డి, పల్లె శ్రీకాంత్ రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు సుధాకర్ రెడ్డి, వట్టికూటి లక్ష్మీనారాయణ హాజరయ్యారు.ఆలయ అర్చకులు బీటుకూరు లక్ష్మాచార్యులు, కలకోట వెంకటరమణాచార్యులు, ఆరుట్ల నారాయణాచార్యులు, ఆరుట్ల వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది నరేష్, గుంటూరు శ్రీనివాస్, మహేందర్, నాగమ్మ, నాగరాజు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.అలాగే భక్తులు ములుగు బసంత్ రెడ్డి, ములుగు శ్రీకాంత్ రెడ్డి తో పాటు శివకేశవ సేవా సమితి సభ్యులు సుమారు 50 మంది ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ఆదివారం- 8 - ఫిబ్రవరి 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మున్సిపల్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో “ప్రజావాణి” రద్దు

- ఫిబ్రవరి 9న జరగాల్సిన కార్యక్రమం నిలిపివేత
- కలెక్టర్ మను చౌదరి ప్రకటన

మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలు-2026 నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరగవలసిన “ప్రజావాణి” కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా అధికారులు ఎన్నికల విధులు నిర్వర్తించాల్సి ఉన్నందున, తేది: 09022026 (సోమవారం) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం ఈసారి నిర్వహించబడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- ఈ నెల 9 నుంచి ఆన్లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):

సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరాల కాలానికి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ మను చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో అర్హత కలిగిన జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంటూ, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మను చౌదరి కోరారు.




# ఆలియాబాద్ 9వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటి ప్రచారం

- పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):


మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని ఆలియాబాద్ మున్సిపల్ 9వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి యమునా శ్యామ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ పాల్గొని ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు.మాకు అప్పగించిన బాధ్యత మేరకు ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, రాబోయే ఎన్నికల్లో యమునా శ్యామ్‌కు మద్దతు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డోలి రమేష్, తుపాకుల జనార్ధన్, కోటేశ్వర, శ్రీధర్ గౌడ్, రాజకుమార్, ఇబ్రహీం తదితరులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.



# మహాశివరాత్రి ఏర్పాట్లపై కీసరగుట్ట ఆలయంలో పోలీసు ఉన్నతాధికారుల తనిఖీ

కీసర, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరగుట్టకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మల్కాజ్‌గిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ అవినాష్ మహంతి శనివారం కీసరగుట్ట ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డీసీపీ శ్రీధర్, ట్రాఫిక్ డీసీపీ, రోడ్ సేఫ్టీ డీసీపీ, అదనపు ఎస్పీ, జవహర్‌నగర్ ఏసీపీ, ట్రాఫిక్ ఏసీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, వాహనాల పార్కింగ్ సదుపాయాలు, భక్తుల క్యూలైన్లు, త్రాగునీరు, వైద్య సౌకర్యాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించారు.శివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ భారీగా ఉండనున్న నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని, పార్కింగ్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సీపీ అవినాష్ మహంతి సూచించారు. అలాగే భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం కీసర పోలీస్ స్టేషన్‌ను కూడా సందర్శించిన ఉన్నతాధికారులు, శివరాత్రి బందోబస్తు ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్.ఐ.లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# త్రివేణి స్కూల్‌లో 16వ ఫన్ ఫెస్ట్ ఘనోత్సవం

- ముఖ్య అతిథిగా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం. శ్రీనివాస్ రావు హాజరు.

సత్తుపల్లి, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):



సత్తుపల్లి పట్టణంలోని త్రివేణి స్కూల్‌లో 16వ ఫన్ ఫెస్ట్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ వై. యార్లగడ్డ వెంకటేశ్వరరావు హాజరుకాగా, సత్తుపల్లి సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సరిత, క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, కిడ్స్ ఇన్‌చార్జ్ పద్మ, అకాడమిక్ ఇన్‌చార్జ్ పవన్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఫన్ ఫెస్ట్‌లో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. వారి ప్రతిభను చూసి హాజరైనవారు మంత్రముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎం. శ్రీనివాస్ రావు విద్యార్థుల ప్రదర్శనలను ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అలాగే పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పాల్గొని వేడుకలను మరింత శోభాయమానంగా మార్చారు. ఈ వేడుకలను విద్యార్థులు ఆనందోత్సాహాలతో, హర్షాతిరేకాలతో జరుపుకోవడం విశేషం.

# వినాయక్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎంపీ ఈటాల రాజేందర్ నిధులతో మహిళా భవన్, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి

వినాయక్ నగర్, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):




మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయక్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయి. ఎంపీ ఈటాల రాజేందర్ నిధులతో శివ నగర్ ఫేజ్-1లో మహిళల కోసం మహిళా భవన్ నిర్మాణానికి రూ.10 లక్షలు, వినాయక్ నగర్ లైన్ నెంబర్-25లో బుడుగ జంగం వారి కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు చేశారు .ఈ పనులకు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి శుక్రవారం కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా భవన్ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి ద్వారా సామాజిక కార్యక్రమాలకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాగర్, వెంకటేష్, శివ నగర్ ప్రెసిడెంట్ అంజయ్య, పరమేష్, దినేష్, వెంకటేశ్వర్లీ, మల్లేష్ యాదవ్, సోమనాథ్, వెంకటేష్, శంకరాచారి, అనసూయ, సుమతో పాటు బీజేపీ నాయకులు ఓం, సాయి, జగదీష్, నరేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అందరి భాగస్వామ్యంతో మరిన్ని పనులు చేపడతామని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు.

# బీఆర్ఎస్,బీజేపీ పార్టీలు రెండు ఒక్కటే

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

హైదరాబాద్,ఫిబ్రవరి07(తెలంగాణ ముచ్చట్లు):




రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకటై కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి కోలగాని అనిల్ తరపున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

అనంతరం 54, 30, 31, 32, 33వ డివిజన్ల కాంగ్రెస్ అభ్యర్థుల తరపున నాకా చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడారు.... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల అమలు కొనసాగాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో గెలిచిన కార్పొరేటర్ల ద్వారా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనని ఆరోపించిన మంత్రి, మున్సిపల్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ఓటర్లు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# నాడు మహాత్మా గాంధీని చంపారు.. నేడు పేరు లేకుండా చేస్తున్నారు

-ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి

హైదరాబాద్,ఫిబ్రవరి07(తెలంగాణ ముచ్చట్లు):



దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మా గాంధీని ఆనాడు మతోన్మాది నాథురం గాడ్సే హత్య చేశారని, ఇప్పుడు ఆయన పేరును ప్రజాపథకాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆరోపించారు.

బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అత్యంత దుర్మార్గమని వ్యాఖ్యానించారు. గాంధీ పేరు తీసేసినంత మాత్రాన ఆయన చేసిన సేవలను దేశ ప్రజలు మర్చిపోరని తెలిపారు.

దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీ మహనీయుల పేర్లు తొలగించడం, స్కాలర్షిప్‌లను రద్దు చేయడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఈ విధానాలు మరింత తీవ్రతరం అవుతాయని, పేదలు బతకలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడం ద్వారా మతోన్మాద శక్తులకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు.

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంతో పాటు ఎస్సీలకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించే రాజీవ్ గాంధీ ఫెలోషిప్‌కు సంబంధించిన యూజీసీ నూతన విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనీయకపోవడం బీజేపీ నియంతృత్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నుంచి తప్పించుకునేందుకు మైక్ కట్ చేయడం నోరు నొక్కడమేనని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు బొమ్మరసమ్మయ్య, సంఘం కోఆర్డినేటర్ ఎండి రహీం, మాదిగ సచి యూత్ అధ్యక్షుడు నక్క మహేష్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, సీనియర్ నాయకులు బోయినలేష్, మాడుగుల శివ, గాదే వెంకట్, జోగు గణేష్, ధనరాజ్, అంజి, దేవరకొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కీసర, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**



వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఫీడర్ నిర్వహణ (పి యం ఐ) పనులు చేపడుతున్న కారణంగా కింది ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కీసర ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలిపారు.చెర్లపల్లి ఎస్ ఎస్5 సబ్‌స్టేషన్ నుండి 11 కేవీ రాంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. ఈ సమయంలో రాంపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు మరియు విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని కోరారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని తెలిపారు.



# జె.కే కాలనీలో నూతన బాక్స్ డ్రైన్ పనులకు శంకుస్థాపన

- **రూ.1.32 కోట్ల కార్పొరేటర్ నిధులతో అభివృద్ధి పనులు**

**వినాయక్ నగర్, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి నియోజకవర్గం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని జె.కే కాలనీలో రూ.1.32 కోట్ల కార్పొరేటర్ రాజ్యలక్ష్మి నిధులతో చేపట్టనున్న నూతన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కాలనీ వాసులతో కలిసి కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు.ఈ బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యలు పరిష్కారమవుతాయని, వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల కలిగే ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్న ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు టిల్లు యాదవ్, రాము యాదవ్, సాయి సురేష్, దరమేష్ యాదవ్, లత, ఝాన్సీ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.





# బడ్జెట్ ధరలో 'యాపిల్' ధమాకా.. ఫిబ్రవరి 19న ఐఫోన్ 17e విడుదల!

టెక్ ప్రపంచంలో మరోసారి యాపిల్ సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన కొత్త బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ ఐఫోన్ 17eను ఫిబ్రవరి 19న గ్లోబల్ మార్కెట్‌లో ఆవిష్కరించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రీమియం బ్రాండ్ అయిన యాపిల్ తక్కువ ధరలో అధునాతన ఫీచర్లతో ఫోన్ విడుదల చేయడం టెక్ ప్రియుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ కొత్త ఐఫోన్ 17e లో 6.1 అంగుళాల ఓలెడ్ డిస్‌ప్లే ఉండే అవకాశం ఉందని సమాచారం. గత మోడళ్లలో ఉన్న నాచ్‌కు బదులుగా ఈసారి ఆధునిక డైనమిక్ ఐలాండ్ ఫీచర్‌ను అందించనున్నారని టెక్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రీమియం ఐఫోన్ లుక్ ఈ బడ్జెట్ మోడల్‌కూ అందుబాటులోకి రానుంది. పర్ఫార్మెన్స్ పరంగా లేటెస్ట్ ఏ 19 చిప్‌సెట్‌ను ఇందులో వినియోగించనున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల గేమింగ్, మల్టీటాస్కింగ్ వంటి పనుల్లో వేగవంతమైన అనుభవం లభించే అవకాశం ఉంది. కెమెరా విభాగంలోనూ యాపిల్ ఈసారి రాజీ పడలేదని టెక్ విశ్లేషకులు చెబుతున్నారు. 48 మెగాపిక్సెల్ మెయిన్ కెమెరాతో ఫోటోగ్రఫీ ప్రియులకు మెరుగైన అనుభవాన్ని అందించనుంది. స్టోరేజ్ విషయంలోనూ ఈ మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భారీ ఫైల్స్, వీడియోలు, ఫోటోలు నిల్వ చేసుకునేందుకు 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్‌ను అందించనున్నట్లు సమాచారం. దీంతో బడ్జెట్ ఫోన్ అయినప్పటికీ ప్రీమియం వినియోగదారుల అవసరాలను కూడా ఈ మోడల్ తీర్చే అవకాశం ఉంది.

భారత మార్కెట్‌లో ఈ ఫోన్ ధర సుమారు 60000 రూపాయల పరిధిలో ఉండవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యాపిల్ ఫోన్‌లకు సాధారణంగా ఉండే అధిక ధరలతో పోలిస్తే ఇది కొంతవరకు అందుబాటులో ఉండే ధరగా భావిస్తున్నారు. ప్రీమియం లుక్, ఆధునిక ఫీచర్లు, యాపిల్ బ్రాండ్ విలువ కలగలిపి వచ్చిన ఈ ఐఫోన్ 17e స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో గట్టి పోటీని తీసుకురావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# ఏఐ ఆయుధాలు


## మానవ నియంత్రణ దాటుతున్న టెక్నాలజీ..



**యుద్ధ రంగంలోకి దూసుకొచ్చిన కృత్రిమ మేధ**
**నిర్ణయం యంత్రానిదే? ప్రాణాల విలువ ఎక్కడ?**
**నియంత్రణలేని అభివృద్ధి – భవిష్యత్‌కు ముప్పా?**

**డెస్క్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**

యుద్ధాల స్వరూపం వేగంగా మారుతోంది. ఒకప్పుడు సైనికులు ముందువరుసలో నిలబడి యుద్ధం చేసిన రోజులు గతించిపోతున్నాయి. నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆయుధాలు యుద్ధ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. డ్రోన్లు, ఆటోమేటెడ్ మిసైల్ సిస్టమ్స్, లక్ష్యాన్ని స్వయంగా గుర్తించి దాడి చేసే యంత్రాలు ఇవన్నీ మానవ జోక్యం లేకుండానే పనిచేసే దశకు చేరుకుంటున్నాయి. వేగం, ఖచ్చితత్వం పేరుతో అభివృద్ధి చెందుతున్న ఈ టెక్నాలజీ, అదే సమయంలో మానవ నియంత్రణను దాటిపోతుందేమో అన్న ఆందోళనను ప్రపంచవ్యాప్తంగా పెంచుతోంది.



ఏఐ ఆయుధాల ప్రధాన ప్రమాదం నిర్ణయ ప్రక్రియలోనే ఉంది. ఒక అల్గారిథం ఎవరు శత్రువు, ఎవరు నిరపరాధి అనే తేడాను ఎంతవరకు గుర్తించగలదు? యుద్ధభూమిలో క్షణాల్లో తీసుకునే నిర్ణయాలు వేలాది ప్రాణాలపై ప్రభావం చూపుతాయి. మానవ అనుభూతి, కరుణ, బాధ్యత అనే అంశాలు యంత్రాల్లో లేవు. ఒకసారి ప్రోగ్రామ్ చేసిన ఆదేశాల ప్రకారం పనిచేసే వ్యవస్థ, పరిస్థితుల సంక్లిష్టతను అర్థం చేసుకోలేకపోతే దారుణమైన పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. పొరపాట్లు జరిగితే బాధ్యత ఎవరిది అన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన



సమాధానం లేదు.

ప్రపంచంలోని శక్తివంతమైన దేశాలు ఏఐ ఆయుధాల అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి. భద్రత పేరుతో ప్రారంభమైన ఈ పోటీ, ఆయుధాల రేస్‌గా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక దేశం ముందడుగు వేస్తే, మరొక దేశం వెనుకబడకూడదన్న భయంతో మరింత శక్తివంతమైన వ్యవస్థలను అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలో అంతర్జాతీయ నియంత్రణలు, నైతిక పరిమితులు వెనక్కి నెట్టి వేయబడుతున్నాయి. నియంత్రణలేని అభివృద్ధి చివరకు ప్రపంచ భద్రతకే ముప్పుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. ఏఐ ఆయుధాల వినియోగంపై స్పష్టమైన నియమాలు, మానవ నియంత్రణ తప్పనిసరిగా ఉండే విధానాలు రూపొందించాల్సిందే. టెక్నాలజీ అభివృద్ధిని ఆపడం సాధ్యం కాకపోయినా, దాన్ని మానవ విలువలకు లోబడి నడిపించటం మాత్రం అవసరం. యుద్ధాల్లో గెలుపు కన్నా మానవత్వం ముఖ్యమన్న సూత్రం మరిచిపోతే, ఏఐ ఆయుధాలు మన రక్షణకంటే వినాశనానికే దారి తీసే ప్రమాదం ఉంది. మానవ నియంత్రణ లేకుండా ముందుకు దూసుకెళ్లే టెక్నాలజీ, చివరకు మనకే ప్రశ్నగా మారుతుందన్న హెచ్చరికను ప్రపంచం ఇప్పుడు గమనించాల్సిన సమయం ఇది.

# 4 లేబర్ కోడ్ల రద్దుకు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

- **మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల పోరాటం**

**కుషాయిగూడ, ఫిబ్రవరి 07 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కె.ఉన్నికృష్ణన్ పిలుపునిచ్చారు.కుషాయిగూడలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ



చట్టం-2025, విబిజి-రామ్‌జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి వంటి నిర్ణయాలు ప్రజా ప్రయోజనాలకు తీవ్రంగా విరుద్ధమని విమర్శించారు.కార్మికుల రక్త త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 2019-2020 సంవత్సరాల్లో 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చారని తెలిపారు. కార్మిక సంఘాల నిరంతర పోరాటాల వల్ల ఇప్పటివరకు వాటి అమలు ఆలస్యమైందని, అయితే 2025 నవంబర్ 21న లేబర్ కోడ్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు.

కార్మిక సంఘాలు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వేళ, ఫ్లోర్ లెవల్ వేతనం పేరుతో రోజుకు కేవలం రూ.178 మాత్రమే నిర్ణయించడం కార్మికుల జీవితాలతో చెలగాటమని అన్నారు. నెలకు రూ.4,628తో కుటుంబాలు ఎలా జీవించాలన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.2013లో జరిగిన 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి హక్కులు కల్పించాలని తీర్మానం చేసినప్పటికీ, నేటికీ వాటి అమలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీమ్‌లను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వాటాను తగ్గించి, నీతి ఆయోగ్ ద్వారా స్కీమ్‌లను ఎప్పుడైనా నిలిపివేసే పరిస్థితిని తీసుకొచ్చిందని ఆరోపించారు.ఈ నేపథ్యంలో స్కీమ్‌ల రక్షణకై, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత సాధన కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కె.ఉన్నికృష్ణన్ పిలుపునిచ్చారు.

# మలేషియాలో భారతీయ సమాజంతో అనుబంధం మరింత బలోపేతం: ప్రధాని నరేంద్ర మోదీ

- **కౌలాలంపూర్‌లో భారతీయులపై ప్రత్యేక ప్రదర్శన**
- **ఆరవ తరం వరకు ఓసీఐ అర్హతపై డయాస్పోరాలో ఆనందం**
- **మలేషియాలో భారత కాన్సులేట్ ఏర్పాటు నిర్ణయం**

మలేషియాలోని భారతీయ సమాజంతో భారతదేశానికి ఉన్న అనుబంధాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కౌలాలంపూర్‌లో జరిగిన కమ్యూనిటీ కార్యక్రమంలో మలేషియాలో భారతీయుల చరిత్ర, సంస్కృతి, సేవలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శన నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.



మలేషియాలో నివసిస్తున్న భారతీయ వంశజులకు సంబంధించి, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు అర్హతను ఆరవ తరం వరకు విస్తరించాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం అక్కడి డయాస్పోరాలో అపారమైన ఆనందాన్ని కలిగించిందని ప్రధాని పేర్కొన్నారు. ఈ నిర్ణయం భారతీయ మూలాలు కలిగిన ప్రజలతో భారతదేశానికి ఉన్న భావోద్వేగ బంధాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు.

రాబోయే కాలంలో మలేషియాలో భారత కాన్సులేట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని ప్రకటించారు. ఈ చర్యతో భారతదేశం-మలేషియా దేశాల మధ్య ప్రజా సంబంధాలు, సాంస్కృతిక అనుబంధం, ఆర్థిక సహకారం మరింత విస్తరించనున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రాహీంను ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ, ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు భవిష్యత్తులో మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ సమాజం రెండు దేశాల మధ్య వంతెనగా నిలుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

# బంపర్ ఆఫర్.. సగం ధరకే శాంసంగ్ ఏసీ, రిఫ్రిజిరేటర్ల సర్వీస్..!

**హైదరాబాద్ – ఫిబ్రవరి 06 – (తెలంగాణ ముచ్చట్లు)**

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్ల వినియోగం భారీగా పెరగనుంది. ఈ సమయంలో వినియోగదారులకు ఊరట కలిగించేలా శాంసంగ్ ఇండియా ప్రత్యేక సమ్మర్ కేర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ప్రచారంలో భాగంగా శాంసంగ్ బ్రాండ్‌కు చెందిన ఏసీలు, రిఫ్రిజిరేటర్ల సర్వీసింగ్‌పై ఏకంగా 50 శాతం వరకు డిస్కౌంట్ అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. వేసవిలో పరికరాలు చెడిపోకుండా ముందుగానే సర్వీసింగ్ చేయించుకునే వారికి ఇది మంచి అవకాశంగా మారింది.

ఈ ఆఫర్‌లో భాగంగా శాంసంగ్ వినియోగదారులకు లేబర్ ఛార్జీలపై సగం వరకు తగ్గింపు, పికప్ మరియు డెలివరీ ఛార్జీలపై కూడా 50 శాతం తగ్గింపు అందిస్తోంది. అదేవిధంగా ఏసీ జెట్ క్లీనింగ్‌పై కూడా 50 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నారు. గ్యాస్ రీఫిల్లింగ్‌పై 15 శాతం వరకు తగ్గింపు, విడిభాగాలు మరియు ఉపకరణాలపై 10 శాతం వరకు తగ్గింపులు వర్తిస్తాయని కంపెనీ తెలిపింది. ఈ ఆఫర్లు శాంసంగ్ బ్రాండ్ ఉత్పత్తులకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేసింది.

శాంసంగ్ ఇండియా ప్రతినిధుల ప్రకారం, క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించుకోవడం వల్ల ఏసీలు,





రిఫ్రిజిరేటర్ల పనితీరు మెరుగుపడుతుంది. దీని ద్వారా మెరుగైన కూలింగ్ లభించడమే కాకుండా విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుంది. అంతర్గతంగా పేరుకుపోయే దుమ్ము, మలినాలను తొలగించడం వల్ల పరిశుభ్రత మెరుగుపడుతుంది. వేసవిలో పరికరాలపై భారం ఎక్కువగా ఉండే సమయంలో అకస్మాత్తుగా చెడిపోవడం వంటి సమస్యలు రాకుండా నివారించుకోవచ్చని కంపెనీ సూచిస్తోంది.

మరోవైపు క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించుకోకపోతే ఏసీల్లో దుమ్ము పేరుకుపోయి కూలింగ్ సామర్థ్యం తగ్గిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దాంతో పాటు అధిక విద్యుత్ వినియోగం జరగడం వల్ల బిల్లులు పెరిగే అవకాశం ఉంది. వేసవి మధ్యలో ఏసీ లేదా ఫ్రిజ్ అకస్మాత్తుగా చెడిపోతే మరింత ఖర్చు భారం పడుతుందని కూడా చెబుతున్నారు.


వేసవి ప్రారంభానికి ముందే ఏసీ సర్వీసింగ్‌కు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. ప్రస్తుతం చాలా సర్వీస్ సెంటర్లలో 5 నుంచి 6 రోజుల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో శాంసంగ్ ప్రకటించిన 50 శాతం డిస్కౌంట్ ఆఫర్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా మారనుందని అంచనా. వేసవి తాపానికి సిద్ధమవుతున్న వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందుగానే తమ పరికరాలను సర్వీస్ చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్


తెలుగు దిన పత్రిక



## తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన పిడమర్తి రవి

**హైదెరాబాద్,ఫిబ్రవరి07(తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ సమాజ స్వరంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్‌ను ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి శనివారం హైదరాబాద్ లో ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలు, సామాజిక అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం వెలుగులోకి తీసుకొస్తూ తెలంగాణ ముచ్చట్లు విశ్వసనీయతతో ముందుకు సాగుతున్న దినపత్రికగా గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రాంతీయ వార్తలకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు నిజమైన సమాచారం అందించడంలో ఈ దినపత్రిక పాత్ర ప్రశంసనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్,తెలంగాణ ముచ్చట్లు చీఫ్ ఎడిటర్ బొల్లెపాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.






## అది నిజమైన ప్రేమ!

చెంపల్లో జారిపడే సిగ్గుని చూడగల్గటం కాదు
కళ్ళల్లో దాగున్న దుఃఖాన్ని,
ఆ దుఃఖం తాలూకు రహస్యాల్ని చదవగల్గితేనే
నీకు తనంటే ఇష్టం వున్నట్టు.

పొడిబారిన పెదాల్ని నలిపి,
తడిపేయడం కాదు.
కన్నీళ్ళన్నీ ఆవిరై
బీడుబారిపోయిన నయనాల్ని ముద్దాడి,
మళ్ళీ కలల్ని చిగురింపజేసినపుడే
నువ్వు తన వాడివైనట్టు.

పేరుకో పువ్విచ్చి
నాలుగు మాటలు చెప్పి నమ్మబలికించి
'ప్రొపోజ్ 'చేయడం..
ప్రేమ కానే కాదు.
ఇచ్చిన మాట నిలబెట్టుకొని
తన నమ్మకాన్ని గెలిచినప్పుడే
నువ్వు పూర్తిగా తన ప్రేమికుడివైనట్టు!!



దియా - విఘ్నేష్

# ఇండియాకు వ్యతిరేక వైఖరితో టర్కీకి దెబ్బ..

- భారతీయ పర్యాటకులు తగ్గుదల
- ఒక్క ఏడాదిలో 25 శాతం తగ్గిన భారతీయ సందర్శకులు
- పాక్‌కు మద్దతుతో టర్కీపై భారత్ అసంతృప్తి
- 'బాయ్‌కాట్ టర్కీ' ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** గత కొన్నేళ్లుగా టర్కీ ఇండియాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటం ఇప్పుడు ఆ దేశానికే నష్టంగా మారుతోంది. జమ్మూ-కాశ్మీర్ అంశంలో పాకిస్తాన్కు బహిరంగంగా మద్దతు తెలపడం, ఇండియా-పాక్ వివాదాల్లో పాక్ వైపు నిలవడం వంటి చర్యల కారణంగా భారత్ నుంచి టర్కీకి వెళ్లే భారతీయ సందర్శకుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. టర్కీ పర్యాటక విభాగం తాజాగా విడుదల చేసిన గణాంకాలే దీనికి నిదర్శనంగా నిలిచాయి.
గణాంకాల ప్రకారం, 2024లో టర్కీకి వెళ్లిన భారతీయుల సంఖ్య మూడు లక్షల ముప్పై వేల తొమ్మిది వందల ఎనభై అయిదుగా ఉండగా, 2025లో అది రెండు లక్షల యాభై వేల ఏడువందల అరవై రెండు మందికి పడిపోయింది. అంటే ఒక్క ఏడాదిలోనే దాదాపు ఇరవై ఐదు శాతం తగ్గుదల నమోదైంది. వ్యాపారం, వినోదం, ఇతర అవసరాల కోసం వెళ్లే ప్రయాణికుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు స్పష్టమవుతోంది.
ఇండియా-టర్కీ మధ్య విభేదాలకు ప్రధాన కారణం టర్కీ అనుసరిస్తున్న రాజకీయ వైఖరేనని విశ్లేషకులు చెబుతున్నారు. జమ్మూ-కాశ్మీర్ అంశంలో పాక్‌కు మద్దతు ఇవ్వడం, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు ఆయుధ సామగ్రి అందించి సహకరించడం వంటి చర్యలు ఇండియాలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించాయి. దీంతో భారత ప్రభుత్వం మాత్రమే కాకుండా, ప్రజలు కూడా ఘాటుగా స్పందించారు.
ఈ పరిణామాల నేపథ్యంలో భారత సోషల్ మీడియాలో 'బాయ్‌కాట్ టర్కీ' ఉద్యమం ఊపందుకుంది. టర్కీ ఉత్పత్తులు కొనొద్దని, టర్కీ పర్యటనలను మానుకోవాలని విస్తృత ప్రచారం జరిగింది. దీని ప్రభావంగా టర్కీ నుంచి భారత్‌కు జరిగే దిగుమతులు కూడా కొంతమేర తగ్గినట్లు సమాచారం. పర్యాటక రంగంలో భారతీయుల వాటా టర్కీకి పెద్దగా కాకపోయినా, రాజకీయంగా, ఆర్థికంగా భారత్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
ఇదే సమయంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను టర్కీతో పాటు అజర్‌బైజాన్ కూడా వ్యతిరేకించాయి. ఈ అంశంలో పాక్‌కు మద్దతు ప్రకటించడంతో, ఇండియా-టర్కీ సంబంధాల్లో మరింత దూరం పెరిగినట్టుగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# భారత అస్త్ర క్షిపణులపై ఆర్మేనియా దృష్టి..

- గగన శక్తికి కొత్త బలం
- సు-ముప్పై యుద్ధ విమానాల్లో అస్త్ర క్షిపణుల అనుసంధానంపై చర్చలు
- దీర్ఘ శ్రేణి గగన యుద్ధ సామర్థ్యం పెంపే లక్ష్యం
- భారత రక్షణ సాంకేతికతపై అంతర్జాతీయ విశ్వాసం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):** తన గగన శక్తిని మరింత బలోపేతం చేసుకునే దిశగా ఆర్మేనియా కీలక అడుగు వేస్తోంది. ఆర్మేనియా వాయుసేనలో ఉన్న సు-ముప్పై యుద్ధ విమానాల్లో భారత్ అభివృద్ధి చేసిన అస్త్ర బియాండ్ విజువల్ రేంజ్ క్షిపణులను అనుసంధానించే అంశంపై చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం.
ఇప్పటికే మెరుగుదల పొందిన అస్త్ర మార్క్-ఒకటి క్షిపణి సుమారు నూట అరవై కిలోమీటర్ల దూరం వరకు లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం కలిగి ఉంది. త్వరలో రానున్న అస్త్ర మార్క్-రెండు క్షిపణి రెండు వందల ఇరవై కిలోమీటర్లకు మించిన శ్రేణిని సాధిస్తుందని అంచనా. దీంతో ఆర్మేనియా వాయుసేనకు దీర్ఘ శ్రేణి గగన యుద్ధ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.
కొత్త యుద్ధ విమానాలను కొనుగోలు చేయకుండానే, ఉన్న సు-ముప్పై విమానాల సామర్థ్యాన్ని పెంచుకోవడం ఈ ఒప్పందం ద్వారా సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. సు-ముప్పై విమానాల సాంకేతిక నిర్మాణం ఇప్పటికే భారత వాయుసేనలో ఉన్న విమానాలకు సమానంగా ఉండటంతో, క్షిపణుల అనుసంధానం సులభమవుతుందని విశ్లేషిస్తున్నారు. పడమర దేశాలు లేదా రష్యా తయారు చేసిన దీర్ఘ శ్రేణి క్షిపణులతో పోలిస్తే అస్త్ర క్షిపణులు ఖర్చు పరంగా అనుకూలంగా ఉండటమే కాకుండా, విశ్వసనీయతలోనూ ముందున్నాయని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిణామం భారత రక్షణ సాంకేతికతపై అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనంగా మారింది.
ఇప్పటి వరకు యుద్ధ వేదికలు మాత్రమే ఎగుమతి చేసిన దేశంగా ఉన్న భారత్, ఇప్పుడు నేరుగా కీలక యుద్ధ సామర్థ్యాన్ని ఇతర దేశాలకు అందించే స్థాయికి చేరిందని రక్షణ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిణామం భారత రక్షణ ఎగుమతులకు కొత్త దిశను చూపుతోందని భావిస్తున్నారు.

# ప్రకృతి విపత్తులు ప్రభుత్వ వైఫల్యాల అద్దం..?

- విపత్తు ప్రకృతిదే నష్టం వ్యవస్థదేనా?
- ముందస్తు హెచ్చరికలున్నా నష్టాలు ఎందుకు?
- బాధితుల కన్నీళ్లలో పాలన ప్రతిబింబమా?

**డెస్క్, ఫిబ్రవరి 7 (తెలంగాణ ముచ్చట్లు):**









ప్రకృతి విపత్తులు మానవ చరిత్రలో కొత్తవి కాదు. వరదలు, భూకంపాలు, తుఫాన్లు, అగ్నిప్రమాదాలు శతాబ్దాలుగా జరుగుతూనే ఉన్నాయి. కానీ నేడు విపత్తుల తీవ్రత మాత్రమే కాదు, వాటి ప్రభావం కూడా విపరీతంగా పెరుగుతోంది. ఒకే వర్షం వందల గ్రామాలను ముంచేస్తోంది, ఒకే తుఫాన్ వేల కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. ఇది కేవలం ప్రకృతి కోపమా? లేక ప్రణాళికల లోపం, పాలనా వైఫల్యాల ఫలితమా అనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది.
ఆధునిక సాంకేతికత ఉన్న ఈ కాలంలో ముందస్తు హెచ్చరికలు, వాతావరణ అంచనాలు అందుబాటులో ఉన్నప్పటికీ నష్టాలు ఎందుకు తగ్గడం లేదు? నగరాల విస్తరణ పేరుతో వాగులు, చెరువులు కబ్జా కావడం, అడవుల నరికి వేయడం, పర్యావరణ సమతుల్యతను పట్టించుకోకపోవడం ఇవి విపత్తులను మరింత భయంకరంగా మారుస్తున్నాయి. ప్రణాళికల లేని అభివృద్ధి, నిబంధనల అమలులో నిర్లక్ష్యం, అవినీతి కలిసి ప్రకృతి విపత్తులను మానవీయ విపత్తులుగా మార్చుతున్నాయి.
విపత్తు తర్వాత స్పందనలోనూ పాలన లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సహాయక చర్యలు ఆలస్యం, బాధితులకు సరైన ఆహారం, వైద్యం, ఆశ్రయం అందకపోవడం, నష్టపరిహారంలో రాజకీయాలు——ఇవన్నీ ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతున్నాయి. విపత్తు సమయంలోనే కాదు, తర్వాతి పునరావాసంలోనూ ప్రభుత్వాల సామర్థ్యం పరీక్షకు నిలుస్తోంది. కానీ చాలా చోట్ల బాధితులు ఏళ్ల తరబడి తాత్కాలిక శిబిరాల్లోనే బతకాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ప్రకృతి విపత్తులను పూర్తిగా ఆపడం మన చేతిలో లేకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. పర్యావరణానికి అనుగుణమైన అభివృద్ధి, కఠినమైన నిబంధనల అమలు, శాస్త్రీయ ప్రణాళికలు, ప్రజల భాగస్వామ్యంతో కూడిన విపత్తు నిర్వహణ విధానాలు అవసరం. విపత్తులు వచ్చినప్పుడే కాదు, రాకముందే ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటేనే ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గుతుంది. చివరికి ఒక నిజం స్పష్టంగా కనిపిస్తోంది——ప్రకృతి విపత్తులు కేవలం భూమి కోపాన్ని కాదు, పాలన బలహీనతలను కూడా అద్దంలా చూపిస్తున్నాయి.




# ఈపీఎఫ్ వర్సెస్ వీపీఎఫ్.. రెండింటికీ తేడా ఏంటి? వీపీఎఫ్ చేస్తే ఈ లాభాలు మీవే..!

ఉద్యోగులు భవిష్యత్ భద్రత కోసం నెలనెలా చేసే ప్రధాన పొదుపుల్లో ఈపీఎఫ్ కీలక పాత్ర పోషిస్తుంది. చాలా మంది సాలరీ నుంచి ఈపీఎఫ్ కట్ అవుతుందని తెలుసు కానీ వీపీఎఫ్ అంటే ఏంటో, దానివల్ల వచ్చే అదనపు ప్రయోజనాలేంటో చాలామందికి పూర్తిగా అవగాహన ఉండదు. వాస్తవానికి ఈపీఎఫ్‌తో పాటు ఉద్యోగులు స్వచ్ఛందంగా అదనపు పొదుపు చేసుకునే అవకాశం కల్పించే పథకమే వీపీఎఫ్. దీని ద్వారా రిటైర్మెంట్ తర్వాత మరింత పెద్ద మొత్తంలో పొదుపు చేతికి అందే అవకాశం ఉంటుంది.
ఈపీఎఫ్‌లో ఉద్యోగి జీతం నుంచి తప్పనిసరిగా 12 శాతం కట్ అవుతుంది. అదే సమయంలో యజమాని కూడా నిర్దిష్ట శాతాన్ని జమ చేస్తాడు. ఇది ఉద్యోగికి భవిష్యత్తులో పెన్షన్, రిటైర్మెంట్ నిధుల రూపంలో ఉపయోగపడుతుంది. కానీ వీపీఎఫ్ విషయంలో ఉద్యోగి స్వచ్ఛందంగా తన ప్రాథమిక జీతంలో ఎంత శాతం కావాలంటే అంత మొత్తాన్ని అదనంగా జమ చేయవచ్చు. కొన్ని సంస్థల్లో అయితే ప్రాథమిక జీతంలో 100 శాతం వరకు కూడా వీపీఎఫ్‌లో పెట్టుబడి పెట్టే వెసులుబాటు ఉంది. దీని వల్ల నెలవారీ పొదుపు పెరిగి, దీర్ఘకాలంలో పెద్ద మొత్తంగా మారుతుంది.
వడ్డీ పరంగా చూస్తే ఈపీఎఫ్‌కు ఎంత వడ్డీ లభిస్తుందో అదే రేటు వీపీఎఫ్‌కూ వర్తిస్తుంది. ప్రస్తుతం ఈపీఎఫ్, వీపీఎఫ్‌పై సంవత్సరానికి 8.25 శాతం వడ్డీ లభిస్తోంది. ఇది రిస్క్ లేని పొదుపు పథకం కావడంతో మార్కెట్ ఒడిదొడుకుల ప్రభావం ఉండదు. స్థిరమైన ఆదాయం ఉన్న ఉద్యోగులకు ఇది భద్రమైన పెట్టుబడి మార్గంగా నిలుస్తోంది.
పన్ను పరంగా కూడా వీపీఎఫ్ మంచి ప్రయోజనాలను ఇస్తుంది. ఈపీఎఫ్, వీపీఎఫ్‌లలో కలిపి జమ చేసే మొత్తం సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపుకు అర్హత పొందుతుంది. సంవత్సరానికి రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. అలాగే సంవత్సరానికి ఈపీఎఫ్, వీపీఎఫ్‌లలో కలిపి జమ చేసే మొత్తం రూ.2.5 లక్షల లోపు ఉంటే దానిపై వచ్చే వడ్డీ పన్ను రహితంగా ఉంటుంది. దీని వల్ల పొదుపుతో పాటు పన్ను ఆదా కూడా సాధ్యమవుతుంది.
వీపీఎఫ్‌లో చేరడం కూడా చాలా సులభం. ఉద్యోగి తన సంస్థలోని హెచ్‌ఆర్ లేదా పేరోల్ విభాగాన్ని సంప్రదించి, తాను ఈపీఎఫ్‌తో పాటు ఎంత మొత్తాన్ని వీపీఎఫ్‌గా జమ చేయాలనుకుంటున్నాడో తెలియజేయాలి. కొంతమంది కంపెనీలు ఈ సౌకర్యాన్ని ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా కూడా అందిస్తున్నాయి. ఒకసారి ఎంపిక చేసిన తర్వాత ప్రతి నెలా జీతం నుంచి నిర్ణీత మొత్తాన్ని ఆటోమేటిక్‌గా వీపీఎఫ్‌లో జమ చేస్తారు. ఉద్యోగం మారినప్పుడు ఈపీఎఫ్, వీపీఎఫ్ ఖాతాలను కొత్త సంస్థకు బదిలీ చేసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది.
భవిష్యత్ అవసరాల కోసం ముందుగానే ప్రణాళిక వేసుకుని పొదుపు చేయాలనుకునే ఉద్యోగులకు ఈపీఎఫ్‌తో పాటు వీపీఎఫ్ మంచి ఆర్థిక భద్రతను అందించే మార్గంగా మారుతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in